మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసిన పాలకమండలి చైర్మన్

**అలంపూర్, జనవరి 21 ప్రభాతవార్త :** రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మాత్యులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో దేవస్థానం చైర్మన్ బెక్కెం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ఈఓ పురెందర్‌కుమార్, పాలక మండలి సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వారికి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రిక అందజేసి వసంత పంచమి రోజు అమ్మవారి నిజరూప దర్శనం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగులాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి వారి ఆలయంలో జరిగే విశేష పూజా కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా భక్తులకు అందించేందుకు ఆన్‌లైన్ సేవలకు వెబ్‌సైట్ ప్రారంభించేందుకు అనుమతి కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సీఎం కెసిఆర్ చేతుల మీదుగా ఆన్‌లైన్ సేవలు ప్రారంభించేందుకు అనుమతిని తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

# ప్రాజెక్టులు ఆపడమే నాగం పని...

- నాగం కన్ను పడిన... కాలు మోపిన అంతా భస్మం....
- ఆయన రాజకీయ జీవితంలో ఒక్క ప్రాజెక్టు అయిన కట్టాడా.!
- కుల రాజకీయాలు, కోర్టు చుట్టే నాగం జీవితం...
- రాజకీయ లబ్ధికోసమే దళిత గిరిజన ఆత్మగౌరవ సభ : ఎమ్మెల్యే మర్రి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 21 ప్రభాతవార్త:** ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు చేపడుతున్న పనులపై నాగం కన్ను పడిన... కాలు మోపిన అంతా భస్మమేనని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ....రైతాంగ సమస్యలను పరిష్కరించి రైతుల వ్యవసాయాన్ని అభివృద్ధి పర్చేందుకు రైతులు తమ భూములను కోల్పోకుండా ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతుంటే రాజకీయ లబ్ధి కోసం రైతులకు మాయ మాట లు చెప్పి ప్రాజెక్టులను ఆపేందుకు కుల రాజకీయాలు చేస్తూ కోర్టుల చుట్టు తిరగడమే నాగం పని అని ఆయన అన్నారు. మార్కండేయ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ఏం తెలుసునని, ఏం చేయడానికి పోయావని, రైతులకు అన్యాయం చేయడానికే కంకణబద్ధులై ప్రాజెక్టును ఆపడానికి వెళ్లావని, సుమారు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎమ్మెల్యే, ఎంపీగా పనిచేసి ఏనాడు అయిన ఒక్క ప్రాజెక్టు కట్టిన పాపన పోయావా అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు నీకు కనిపంచడం లేదా అని, రూ.80 కోట్లతో 6వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకొని 6 ఎకరాల నష్టంతో 6వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని ఆయన అన్నారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన నన్నేమి చేయలేరని, కేజ్రీవాల్ కట్టించిన పాఠశాలల్లో వాచ్‌మెన్‌గా కూడా పనికి రావాని, నీవల్ల కాంగ్రెస్ నాయకులు భూములు అమ్ముకొని హైదరాబాద్‌కు వెళ్లారని, ఒక దళిత, గిరిజన అమ్మాయికి అయిన వివాహం చేశావా అని ఆయన అన్నారు. ఇంజనీరింగ్ కళాశాలను అమ్ముకున్న ఘనత నీది కదా అని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలో ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో నిరుపేద విద్యార్థులకు విద్య అందుబాటులో ఉండేదని ఆయన అన్నారు. వైద్యశాఖ మంత్రిగా పనిచేసి మెడికల్ కళాశాలను తీసుకొని రాలేదని, జిల్లాకు వచ్చిన ఇంజనీరింగ్ కళాశాలను నీ స్వంత స్వలాభం కోసం నిర్మించకుండా అడ్డుకున్నావు కదా... అదే ఇంజనీరింగ్ కళాశాలను జిల్లా కేంద్రానికి తీసుకొస్తానని సవాల్ విసిరారు. 40 ఏండ్లుగా కందనూలు ప్రజలను మోసం చేస్తూ స్వంత ఆస్తులను పెంచుకోవడానికి చూశావే తప్ప డాక్టర్‌వి అయి ఉండి పేద ప్రజలకు వైద్య సేవలందించేందుకు నిర్మించావా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు కనిపించకపోతే రాష్ట్ర ప్రభుత్వం బృహత్తరంగా చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమానికి వెళ్లి కండ్లు చూయించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

# అభ్యర్థులకు కొదవలేదు..!

**23,24 తేదీలలో పాలమూరు బిజెపి**

**రాష్ట్ర కార్యవర్గ సమావేశం బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఎపి జితెందర్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి 21 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ కార్యకర్తల పార్టీ, కార్యకర్తలు బలంగా ఉంటే అభ్యర్థులకు కొదవలేదని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఎపి జితెందర్‌రెడ్డి కొనియాడారు. శనివారం ఆయన పాలమూరు పట్టణంలోని అన్నపూర్ణ గార్డెన్ ప్రాంతాన్ని పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23,24 తేదీలలో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మహబూబ్‌నగర్‌లోని అన్నపూర్ణ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే పార్టీ నేతలకు ఎలాంటి లోటు రాకుండా సౌకర్యాలు చూసుకోవాలని జిల్లా నాయకులకు సూచించారు. దక్షిణ భారత దేశముచ ద్వారం పాలమూరు అని అన్నారు. ఈ ప్రాంతం నుంచి ప్రధాని నరెంద్రమోడీ పార్లమెంటుకు పోటీచేస్తే తెలంగాణ ప్రాంత అభివృద్ధితో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ ప్రాంతాల అభివృద్ధి కూడా చెందే అవకాశం ఉందని జాతీయ అధ్యక్షుడు నడ్డా దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన తెలిపారు. పాలమూరు ప్రాంతం సమస్యలను చెప్పుకుని ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారని అన్నారు. పాలమూరు ఎంపిగా ఉండి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పాలమూరు ముఖ్యమంత్రి కెసిఆర్ ఇక్కడి సమస్యలను పట్టించుకోలేదన్నారు. పక్కనే పారుతున్న కృష్ణా జలాలను ఈ ప్రాంతంలోని 24 లక్షల ఎకరాలకు ఇస్తానని చెప్పి ఎనిమిది సంవత్సరాలైనా ఒక్క ఎకరాకు కూడా నీళ్లు పారించలేదని విమర్శించారు. ఈ తరుణంలో ప్రధాని మోడీ పోటీ చేయడం ఈ ప్రాంత ప్రజలకు నిరుద్యోగ యువతకు మేలు జరుగుతుందని ఆయన అన్నారు. ఈ నెల 23,24న జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహరచన ఉంటుందని వారు తెలిపారు. ఈ సమవేశంలో జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాకుల బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్‌రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షు డు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఓబిసి మోర్చా అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ యాదవ్, పట్టణ అధ్యక్షులు నారాయణయాదవ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జితెందర్‌రెడ్డి

# ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం...

**ఊర్కొండ, జనవరి 21, ప్రభాతవార్త:** ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తోందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఊర్కొండ మండలం బొమ్మరాశిపల్లి గ్రామానికి చెందిన విజయ్ కుమారుడు తులసీధర్ వినికిడి లోపంతో బాధపడుతున్నాడు. గ్రామ సర్పంచ్ బోయ లక్ష్మమ్మ అంజయ్య మాజీ మంత్రివర్యులు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి తులసీధర్‌కు ఉన్న వినికిడి సమస్యను సూచించడంతో స్పందించిన ఎమ్మెల్యే తులసీధర్‌కు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.6.50లక్షల చెక్కును మంజూరు చేయించారు. శనివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తులసీధర్‌కు మంజూరైన రూ.6.50లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ బీఆర్ఎస్ నాయకులు బోయ వెంకటేష్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరప్రధాయినిగా నిలుస్తోందన్నారు. ప్రమాదాల్లో గాయపడ్డవారు, అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా డబ్బులు అందించి తన కుమారుడి వైద్యానికి సహకరించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, గ్రామ సర్పంచ్‌కు విజయ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## అడుగడుగునా అభివృద్ధి... గడప గడపకు..

# సంక్షేమ ఫలాలు..!



వశ్య తాండాలో సీసీ డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి

- 8ఏళ్లలో అభివృద్ధి దిశగా గ్రామాలు, పట్టణాలు...
- మిషన్ భగీరథతో ప్రతి ఇంటికి శుద్ధజలం..
- దేశంలో ఎక్కడాలేని విధంగా 47లక్షల మందికి ఆసరా పెన్షన్లు..
- దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం..
- చిమనగుంటపల్లి పల్లెనిద్రలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.



చిమనగుంటపల్లి గ్రామంలో పర్యటిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 21 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రధాత ఉద్యమనేత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా అడుగడుగున అభివృద్ధి ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామంలో మంత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి గ్రామస్తులతో సమావేశమై పలు సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 8ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని పల్లెలు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్నాయని ఇందుకు కేసీఆర్ ముందుచూపే నిదర్శనమని పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా మౌలిక వసతులను కల్పించడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠదామాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాతంతో పల్లెలు పట్టణాలను తలపిస్తున్నాయని అన్నారు. మిషన్ భగీరథ పథకంతో ప్రతి ఇంటికి శుద్ధమైన జలాన్ని అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. వనపర్తి చుట్టు ఉన్న చెరువులను పునరుద్దరించడంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదంతో పాటు బోరు బావుల్లో నీటి శాతం పెరిగిందన్నారు. నల్లచెరువు, తాళ్లచెరువు, అమ్మచెరువు లను మినీ ట్యాంక్ బండ్ లుగా తీర్చిదిద్దడంతో ఒకప్పుడు మురికికూపంగా ఉన్న చెరువులు నేడు కృష్ణా నీటితో కళకళలాడుతున్నాయని అన్నారు. వనపర్తిలో రహదారుల విస్తరణ పూర్తి అయితే రాష్ట్రంలోనే వనపర్తి పట్టణం ఒక మాడెల్ పట్టణంగా చరిత్రలో నిలుస్తుందన్నారు. ప్రజల సహకారంతో అభివృద్ధి పనులను శరవేగంగా ముందుకు తీసుకు వెళ్తున్నామని అన్నారు. పల్లె నిద్రలతో క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉన్న అవసరాలను గుర్తించి వాటిని అక్కడిక్కడే పరిష్కరిస్తున్నామని అన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందాలన్న దృఢసంకల్పంతో ఎంతో శ్రమకోర్చి పనులు చేపడుతున్నామని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 47లక్షల మందికి ప్రతి నెలనెల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, అమ్మఒడి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి బృహత్తర కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లకుండా పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందజేస్తున్నామన్నారు. ఒకప్పుడు వలసలతో పడావుపడ్డ పల్లెలు సాగునీటి రాకతో నేడు పాడి పంటలతో కళకళలాడుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. శనివారం ఉదయం గ్రామంలో పర్యటించిన మంత్రి ఠరపజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు, అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 70మందికి మంజూరైన రూ.20.64 విలువైన చెక్కులను మంత్రి అందజేసి లబ్దిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం నల్లచెరువు పై రూ.1కోటి15లక్షలతో, వశ్య తాండాలో రూ.84లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు, మెట్టుపల్లిలో రూ.45లక్షలతో నిర్మించే సీసీ డ్రైన్ నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన మంత్రి రాజనగరం అమ్మచెరువు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మెన్ గట్టుయాదవ్, మార్కెటన కమిటీ చైర్మెన్ రమేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.



వృద్ధ మహిళలతో మాట్లాడుతున్న మంత్రి



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి



సహపంక్తి భోజనాలు చేస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి

# చదువుతో పాటు క్రీడల్లో కూడ యువత రాణించాలి..

**-దేవరకద్రలో ఆల రఘుపతిరెడ్డి జ్ఞాపకార్థం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆల**

**దేవరకద్ర, జనవరి 21 ప్రభాతవార్త:** చదువుతో పాటు క్రీడల్లోకూడ యువత, విధ్యార్థులు బాగా రాణించాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. దేవరకద్రలో శనివారం కీర్తిశేషులు ఆల రఘుపతిరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న దేవరకద్రలో ప్రీమియర్ లీగ్ (డిపిఎల్ సీజన్- 2)క్రికెట్ టోర్నిని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆల ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలు విధ్యలో అంతర్భాగమన్నారు. చిన్నతనం నుండే క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. క్రీడారంగానికి ప్రభుత్వం అధికప్రాధాన్యత ఇస్తుందన్నారు. క్రీడలకు సమయాన్ని కెటాయించి, వాటిని ప్రోత్సహించడం యువకుల, విధ్యార్థుల బాధ్యత అన్నారు. క్రీడారంగాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతేగాకుంగా క్రీడాకారులను తగు విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కట్టుబడి ఉందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. వాటిని క్రీడాకారులు సమానంగా స్వీకరించాలన్నారు. శాంతియుత వాతావరణంలో క్రీడలు నిర్వహించుకోవాలన్నారు. క్రీడలకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడాకారులు క్రీడా స్పూర్తితో ఆడాలన్నారు. అలాగే విధ్యార్థులు పరిక్షల్లో ఉత్తీర్ణత కాకపోయిన, ఉద్యోగాలు రాకపోయిన నిరుత్సాహంతో మానసిక ధైర్యాన్ని కోల్పోయి ఆత్యహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేధన వ్యక్తపరిచారు. ఇది మంచి పద్దతి కాదన్నారు. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని తీసుకరావడానికి నియోజకరవర్గ స్థాయిలో ఈ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నిని నిర్వహించడం ఎంతో అభినందనీయమని నిర్వహకులను ఎమ్మెల్యే ఆల అభినందించారు.



దేవరకద్రలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆల



దేవరకద్రలో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే ఆల

**ఆకట్టుకొన్న ఎమ్మెల్యే ఆల బ్యాటింగ్..**

దేవరకద్రలో ప్రీమియర్ లీగ్ (డిపిఎల్ సీజన్- 2)క్రికెట్ టోర్ని ప్రారంభం సందర్భంగా శనివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేసిన బ్యాటింగ్ చూపరులను ఎంతగానో ఆకట్టుకొంది. ఆయన సరదాగా కాసేపు క్రికెట్ ఆడి అందరి దృష్టిని ఆకట్టుకొన్నారు. ఎమ్మెల్యే బ్యాటింగ్ ను చూడటానికి చాలా మంది ఆసక్తికనబర్చారు. ఈ సందర్భంగా టోర్నిలో పాల్గొంటున్న క్రీడాకారులకు ఎమ్మెల్యే ఆల జెర్సీలను అందజేశారు. క్రీడాకారులను ప్రతి ఒక్కరు పరిచయం చేసుకొన్నారు. అనంతరం (డిపిఎల్ సీజన్- 2) జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించి, టాస్ వేసి ఎమ్మెల్యే ఆల టోర్నిని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అన్నపూర్ణ శ్రీకాంత్, యంపీపీ కెంగూరి రమా శ్రీకాంత్‌యాదవ్, చిన్నచింతకుంట యంపీపీ హర్షవర్ధన రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టినరసింహ్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మున్నూరు బాల్‌రాజ్, దేవరకద్ర పీఎసిఎస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి, మాజీ యంపీటీసీ ఉస్కిళ్ళ వెంకట్రాములు, మూడా కార్యవర్గ సభ్యుడు కరణం రాజు, నాయకులు కొండ శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, కొండ భాస్కర్‌రెడ్డి, రంగయ్య గౌడ్, వెంకటేశ్, యూత్ నాయకులు మెడికల్‌షాపు రాము, యుగేందర్‌రెడ్డి, చల్మారెడ్డి, సయ్యద్ జకి, చిన్న, కొండల్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో కాంగ్రెస్సే పేదలకు పట్టెడన్నం పెట్టింది: మాజీ మంత్రి నాగం

**బిజినేపల్లి, జనవరి 21 ప్రభాతవార్త :** దేశంలోని నిరుపేదలకు పట్టెడన్నం పెట్టి ఆదుకున్న ఏకైకపార్టీ కాంగ్రెస్ పార్టీయేనని మాజీ మంత్రి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు నాగం జనార్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఈనెల 22న నిర్వహించే దళిత గిరిజన ఆత్మగౌరవ మహాసభ ఏర్పాట్లు శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ హోదాలో ప్రజాస్వామిక బద్ధంగా ప్రజల పక్షాన అధికార పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అడిగితే బిఆర్ఎస్ గుండాలు దౌర్జన్యంగా, అప్రజాస్వామికంగా భౌతిక దాడులకు పాల్పడడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత గిరిజన బిడ్డలని కూడా చూడకుండా కుతికపై కాలుపెట్టి చంపేందుకు యత్నించిన బిఆర్ఎస్ గుండాలను వెంటనే అరెస్టు చేసి వారిపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి కేసులు నమోదు చేసి చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పక్కా ఇళ్ల నిర్మాణం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేసి ప్రజలకు మేలు చేస్తామని అన్నారు. అలాగే తప్పుల తడకగా ఉన్న ధరణి వెబ్‌సైట్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి ప్రజలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామని అన్నారు. భూ మార్పిడి చేసుకోవాలంటే నానా తంటాలు పడాల్సి వస్తుందని రైతులు తమ దృష్టికి తెచ్చారని అందుకోసమే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అందరికి ఆమోదయోగ్యమైన రెవెన్యూ పాలసీని తీసుకొస్తామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రజాకార్లను మించిన పాలన సాగుతుందని వీరికి చరమగీతం పాడాల్సిందేనని ప్రజలను కోరారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన దళిత గిరిజన ఆత్మగౌరవ మహాసభకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, అర్థంరవి, పాండు, మండలాధ్యక్షుడు కూచుకుళ్ల సుహాసన్‌రెడ్డి, ఉపసర్పంచ్‌లు మిద్దెరాములు, పులిదండ రాగేష్, ఎంపిటిసి సభ్యులు ఆంజనేయులు, మిద్దెమల్లేష్, మండల నాయకులు గంగనమోని కురుమయ్య, బాల్‌రాజ్, వేణుగోపాల్, మ్యాతరి సత్యం, వాల్యానాయక్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారెడ్డి, వెంకటేష్‌గౌడ్, పాషా, కృష్ణారెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, మిద్దెసూరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగం జనార్ధన్‌రెడ్డి

# పోస్టల్ డిపార్ట్‌మెంట్‌పై కలెక్టర్ సీరియస్...

**నాగసాల చెరువులో ఆధార్ కార్డులు లభ్యంపై ఆరా**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి21, ప్రభాతవార్త:** జడ్చర్ల పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంపై మహబూబ్‌నగర్ కలెక్టర్ సీరియస్ అయ్యారు. ప్రజలకు చేరవేయాల్సిన వందలాది ఆధార్, ఏటీఎం కార్డులు, ఇతరత్ర విలువైన పత్రాలు చెరువులో వేయడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే..మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల పరిధిలోని నాగసాల చెరువులో విలువైన వందలాదిగా ఆధార్, ఏటీఎం, కోర్టు సమన్లు, లైసెన్సులు, ఇతర విలువైన కార్డులు కుప్పకుపలుగా చెరువులో తేలియాడుతూ కనిపించడంపై సోషల్ మీడియాలో వీడియోలు, ఫోటోలు వైరల్ అయ్యాయి. ఈ విషయం కలెక్టర్ వెంకట్రావు దృష్టికి వెళ్లడంతో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎంతో విలువైన ఖర్చుతోతో వ్యయ ప్రయాసాతలో కూడుకున్న కార్డులను అలా నిరుపయోగంగా పారేయడంపై సీరియస్ అయ్యారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. దీంటో వెంటనే సంబంధిత పోస్టల్, రెవెన్యూ సిబ్బంది కార్డులను స్వాధీన పర్చుకున్నారు. పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంఘటనా స్థలానికి విచారణ చేపట్టారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



చెరువులో సిబ్బంది స్వాధీనం చేసుకున్న కార్డులు

గిరిజనుల అభివృద్ధే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం

# ఎస్టీ కార్పోరేషన్ రూలర్ ట్రాన్స్‌పోర్టు పథకం ద్వారా లబ్ధిదారులకు సబ్సిడి రుణాలు మంజూరు

**కెటిదొడ్డి, జనవరి 21 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన కార్పోరేషన్ ద్వారా కెటి దొడిన మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది ఎస్టీ లబ్దిదారులకు స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రొసీడింగ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ఎమ్మెల్యేకు నోట్ పుస్తకాలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాతనే సీఎం కెసిఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందే విధంగా అనేకమైన పథకాలను ప్రవేశపెట్టి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ప్రజల సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కెసిఆర్ ప్రతి తండాను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి వారిలోనే ఒకరిని గ్రామ సర్పంచ్‌గా నియామకం చేసి మిగతా గ్రామాలతో పాటుతండాల అభివృద్ధి కూడా వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమానంగా గిరిజనులు అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రభుత్వం అందరిని ఆదుకునే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫోరం అధ్యక్షుడు విజయ్, వైస్ ఎంపిపి రామకృష్ణ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు ఉరుకుంద, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు హనుమంతు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి తిమ్మప్ప, గద్వాల టౌన్ పార్టీ అధ్యక్షుడు గోవిందు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చక్రధర్‌రావు, వెంకన్నగౌడ్, వెంకటేష్‌గౌడ్, కృష్ణ, ఆంజనేయులు, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, కురుమన్న, ఆంజనేయులు, పాండునాయక్, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్లు భగవంతు, సురేష్‌నాయక్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చెరువులో సిబ్బంది స్వాధీనం చేసుకున్న కార్డులు

## విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ...

**ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 21 ప్రభాతవార్త:**తాడూర్ మండల పరిధిలోని భలాన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ అశోక్ గుప్త ఆధ్వర్యంలో టై బెల్టులు, క్రీడా సామాగ్రిని పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, ఎక్సైజ్ సీఐ ఏడు కొండలు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు టై బెల్టులు,క్రీడా సామాగ్రిని అందించారు.గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయుల బృందం కోరిక మేరకు పాఠశాలలోని 9వ తరగతి గదిలో



బెంచీల ఏర్పాటుకు రూ.20వేల అందిస్తానని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ పేర్కొన్నారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, ఎక్సైజ్ సీఐ ఏడుకొండలును పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా పీఆర్‌ఓ మిర్యాల రాజయ్య, వెల్దండ మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## మానవ సేవయే.. మాధవ సేవ:ఎంఈఓ శంకర్‌నాయక్

**వంగూరు, జనవరి 21 ప్రభాతవార్త:**మండల పరిధిలోని పోతారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కీ॥శే॥ పులిజాల ఎల్లమ్మ చిన్న లింగయ్యల వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు టై, బెల్టు, బ్యాడ్జీలను అందించారు.ఈ కార్యక్రమానికి ఎంఈఓ శంకర్‌నాయక్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. సమాజంలో ప్రతి మనిషి సేవా దృకథ్పం కలిగి ఉండాలని, విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. విద్యార్థులకు పేదరికం అడ్డుకాదని, ప్రతి మనిషికి తనకు తోచిన సహాయా



న్ని అందించి గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులను గుర్తించి తగిన సహాయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పరుశరాములు, హుస్సైన్, రైతు సంఘం అధ్యక్షులు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామస్వామి, నర్సింహ్మ, నారాయణరెడ్డి, మాజీ చైర్మన్ పురుషోత్తంగౌడ్, ప్రభావతి, కిరణ్, నికిల్, సృజన, శేఖర్, బాలస్వామి తదితరులు ఉన్నారు.

## సీఎం కుటుంబ సభ్యులకు ఆహ్వానం..

**సీఎం కెసిఆర్ సతీమణి శోభ, కూతురు కవితలకు బ్రహ్మోత్స వాల ఆహ్వానం**

**అలంపూర్,జనవరి 21 ప్రభాతవార్త :** జోగులాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్స వాల సందర్భంగా వసంత పంచమి రోజున జోగులాంబ అమ్మవారి నిజరూప దర్శనాన్ని తిలకించేందుకు రావాలంటూ శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ సతీమణి శోభ, వారి కుమార్తె అయిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు దేవస్థానం ఆహ్వాన పత్రికలను అందజేసింది. ఈ మేరకు దేవస్థానం ఈఓ పురందర్‌కుమార్, ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి,



దేవస్థానం ప్రధాన అర్చకులు ఆనందశర్మ వార్షిక బ్రహ్మోత్స వాలకు సంబంధించినటువంటి ఆహ్వాన పత్రికలు, అమ్మవారి శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసి వేద ఆశీర్వచనం చేస్తూ వారిని బ్రహ్మోత్స వాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ జోగులాంబ ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సి న, అదేవిధంగా అక్కడ నెలకొన్న సమస్యలపై మాట్లాడుతూ అమ్మవారి ఆలయంపై ఆమెకు ఉన్న భక్తిని చాటుకున్నారు. 26వ తేదీ వసంత పంచమి రోజు అమ్మవారి ఆలయాన్ని దర్శించుకునే విషయంలో సీఎం కుటుంబ సభ్యులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు జయన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, హరిబాబు, ఆలయ మాజీ ధర్మకర్త వెంకట నరసింహారెడ్డి, నరేందర్ తదితరులు ఉన్నారు.

## అల్లె శ్రీనివాస్‌కు ప్రగాఢ సానుభూతి తెలిపిన బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు

**రాజాపూర్,జనవరి 21 ప్రభాతవార్త :** రాజాపూర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ అల్లె శ్రీనివాస్ తండ్రి అల్లె సహదేవయ్య మృతి చెందడంతో శనివారం మండల బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి ఉపసర్పంచ్ అల్లె శ్రీనివాస్‌కు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు,



తిరుమలాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ రామకృష్ణగౌడ్, మార్కెట్ కమిటి డైరెక్టర్ అల్లె తిరుపతయ్య, యూత్ వింగ్ మండల అధ్యక్షులు బంగారు వెంకటేష్, పార్టీ మండల ఉపాధ్యక్షులు రాచమల్ల యాదగిరి, నర్సింగ్ తండా ఉపసర్పంచ్ మహిపాల్, భాషమౌని చెన్నయ్య, హనుమంతు,నజీంబేగ్, లక్ష్మయ్య, యాదయ్య, నవీన్ తదితరులు ఉన్నారు.

## రజకుల ఆరాధ్య దైవం మాడెలయ్య స్వామి..

**జల్లాఘణపురం,జనవరి 21 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో రజకుల ఆరాధ్య దైవం మాడెలయ్య స్వామి దేవాలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానని సర్పంచ్ క్యామ వెంకటరమణ తెలిపారు. జల్లాఘణపురం మండల కేంద్రంలోని రజకుల గురువు మాడెలయ్య స్వామి దేవాలయం సర్వే నెంబర్ 5/6 అన్నహాడ్ శివారులో నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ఆలయ నిర్మా



ణానికి స్థల సేకరణ నిమిత్తం ప్రస్తుతం ఉన్న పట్టాదారులతో మాట్లాడి మాడెలయ్య స్వామి దేవాలయం నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అన్ని కులాలకు మతాలకు సీఎం కేసీఆర్ సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. తెలంగాణలోని అన్ని వర్గాలకు సమాన ప్రాదాన్యత కల్పిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రజకులకు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఆలయ నిర్మాణం కోరుతూ రజకులు శనివారం రజక సంఘం జిల్లా అధ్యక్షులు విజయ్ ఆధ్వర్యంలో సర్పంచ్ క్యామ వెంకటరమణ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు రవీందర్, పకీరయ్య దేవరకొండ రాములు, బాలస్వామి, తిరుపతయ్య, దేవరకొండ బాలస్వామి, శ్రీనివాసులు, కేశవులు, పాలకొండ నారాయణ, గణేష్, రామచంద్రయ్య తిరుతపయ్య సుశీల, శివ వెంకటేష్, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు ప్రారంభించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు

**గండీడ్,జనవరి 21 ప్రభాతవార్త :** జనవరి 26 రిపబ్లిక్ డే సంబరాలను పురస్కరించుకుని ఎంపియుపిఎస్ రుసుంపల్లిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఎం చంద్రకాంత్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ శిరీష క్రీడలు ప్రారంభించారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి సర్పంచ్, గ్రామ మహిళలు సరదాగా కబడ్డి ఆడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, ఐకమత్యం,



సోదర భావాన్ని పెంపొందిస్తాయని, క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని తెలిపారు.

## గ్రామ పంచాయతీ, అంగన్‌వాడి భవనం కోసం స్థల పరిశీలన

**మూసపేట,జనవరి 21 ప్రభాతవార్త :** మూసపేట మండల పరిధిలోని సంకలమద్ది గ్రామంలో శనివారం సర్పంచ్ దేవరకొండ స్వరూప ఆధ్వర్యంలో అంగన్‌వాడి భవనం,గ్రామ పంచాయతీ భవనం కోసం ప్రభుత్వ స్థలం పరిశీలించారు. ఈనెల 23 సోమవారం ఎమ్మెల్యేఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామ పంచాయతీ భవనం అంగన్‌వాడి భవనం నిర్మాణాల కొరకు భూమిపూజ చేయడానికి వస్తున్నారని సర్పంచ్ దేవరకొండ స్వరూప తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్



కొట్లరవి, మండల రైతు సంఘం అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్,బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, హైమద్, అశోక్‌రెడ్డి, దాసరి వెంకటేష్, చంద్రయ్యగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, బడబాలయ్య, ప్రదీప్‌రెడ్డి,సాయిరెడ్డి, రజినీకాంత్, కుమార్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ప్రధానధ్యేయం : ఎమ్మెల్యే ఆల

**- దేవరకద్రలో లబ్ధిదారులకు రూ.6.96లక్షల చెక్కుల అందజేత**

**దేవరకద్ర,జనవరి 21 ప్రభాతవార్త:** ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ప్రధానధ్యేయమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు.దేవ రకద్రలో శనివారం లబ్దిదారులకు రూ.6.96లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఆల అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తుందన్నారు. అన్ని వర్గాల అభ్యుతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని ప్రజాసంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం రికార్డు సృష్టించిందన్నారు. ఈ సందర్భంగా దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 19 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

**ఎల్‌ఓసి అందజేసిన ఎమ్మెల్యే ఆల..**

దేవరకద్ర మండలం పెద్దగోప్లాపూర్ గ్రామానికి చెందిన నన్నెసాబ్‌కు శనివారం చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.2.50లక్షల ఎల్‌ఓసిని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు. హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో ఖర్చుల నిమిత్తం దీనిని ఎమ్మెల్యే ఆల అందజేశారు.

**మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆల పరామర్శ..**

దేవరకద్ర మండలం పెద్దగోప్లాపూర్‌లో ఇటీవల మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్త నాగరాజు కుటుంబసభ్యులను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు.ఈసందర్భంగా ఆ కుటుంబానికి ఎమ్మెల్యే



దేవరకద్రలో సియంరిలీఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల

ఆల రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అన్నపూర్ణ శ్రీకాంత్,యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్ యాదవ్,చిన్నచింతకుంట యంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి,బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టినరసింహ్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్,బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మున్నూరు బాల్‌రాజ్,దేవరకద్ర పీఏసిఎస్ చైర్మెన్



నాగరాజు కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల

నరేందర్‌రెడ్డి,మాజీ యంపీటీసీ ఉస్కిళ్ళ వెంకట్రాములు,మూడా కార్యవర్గ సభ్యుడు కరణంరాజు,నాయకులు కొండ శ్రీనివాస్‌రెడ్డి, శంకర్,కొండ భాస్కర్‌రెడ్డి,రంగయ్యగౌడ్,వెంకటేశ్,యూత్ నాయకులు మెడికల్‌షాపు రాము,యు గేందర్‌రెడ్డి,చల్మారెడ్డి, సయ్యద్ జకి,చిన్న,కొండల్,ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యను అందించినప్పుడే ఆర్థిక అసమానతలు తొలుగుతాయి

**-విముక్త, సంచార జాతుల కేంద్ర సంరక్షణ బోర్డు సభ్యులు తురక నర్సింహ**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 21 ప్రభాతవార్త:**దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలు పెరిగిపోయాయని, వీటిని తొలగించడానికి అణగారిన విముక్త సంచార జాతుల పిల్లలకు మెరుగైన విద్యా ప్రమాణాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించాల్సి ఉంటుందని విముక్త సంచార జాతుల కేంద్ర సంరక్షణ దక్షిణ భారతదేశ సభ్యులు తురక నర్సింహ సూచించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో విముక్త, సంచార జాతుల ప్రజలు ఎంత మంది ఉన్నారు, ఏ ఏ జాతులు తెగల వారు ఉన్నారు, వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఎలా ఉన్నాయి, వారికి ప్రభుత్వం ద్వారా అందించిన అసైన్డ్ భూములు ఎంత అవి, ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయి, ఎంత మంది కబ్జాలో ఉన్నారు అనే పూర్తి నివేధిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంచార జాతులను ఆదుకుంటామని సంచార జాతులైన సింధు, బుడగ జంగాలు, వడ్డెర, దొమ్మరి, మేదరి, బుడబుక్కలకు చెందిన వారు వివిధ గ్రామాల్లో సంచారం చేస్తూ



సమావేశంలో మాట్లాడుతున్న విముక్త, సంచార జాతుల కేంద్ర సంరక్షణ బోర్డు సభ్యులు తురక నర్సింహ

జీవనం సాగిస్తున్నారన్నారు. వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకోవడం కోసమే తాను పర్యటిస్తున్నట్లు తెలిపారు. సంచార జాతుల జీవన పరిస్థితులపై ఒక నివేధిక రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈ కులాల అభివృద్ధికి ఏం చర్యలు తీసుకోవాలో కేంద్రానికి నివేధిస్తామన్నారు. సంచార కులాల్లో ఎస్సీ, బీసీలే ఎక్కువగా ఉన్నాయన్నారు. సంచార జాతుల కళాకారుల అభివృద్ధికి వివిధ పార్టీల నాయకుల సలహాలు ఇచ్చి వీరి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామేశ్వర్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, జీసీసీ మేనేజర్ సంతోష్, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్‌గోపిడి, డీఈఓ గోవిందరాజులు, డీపీఓ కృష్ణ, డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, డీపీఆర్‌ఓ సీతారాం, ఏసీ రాజశేఖర్‌రావు, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగరాజు, సెక్టోరియల్ అధికారులు సూర్యచైతన్య, వెంకటయ్య, సతీష్‌కుమార్, మండల విద్యాధికారులు, కేజీబీవీల ప్రత్యేకాధికారులు, వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## పేద రైతన్నకు ఆపన్నహస్తం... తిరుమల తిరుపతి దేవస్థాన ధాతృత్వం...

**అచ్చంపేట, జనవరి 21 ప్రభాతవార్త:**అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్ మండలం తుమ్మన్‌పేట గ్రామంలోని నిరుపేద దళిత కుటుంబానికి చెందిన తిరుపతయ్య తనకున్న 3 ఎకరాల వ్యవసాయ పొలంలో వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో ఇతరులకు కౌలుకు ఇచ్చి వ్యవసాయ కూలీగా మారాడు. జిల్లా కలెక్టర్ చొరవతో 2021లో తిరుమల తిరుపతి దేవస్థానం గోశాల నుంచి 2 హెచ్‌ఎఫ్ జాతికి చెందిన ఆవులను దేవుని ప్రసాదంగా తిరుపతయ్యకు అందించారు. తిరుపతయ్యకు ఉచితంగా అందించిన ఆవులు వరంగా మారాయి. జిల్లా పశు సంవర్ధక శాఖ, వ్యవసాయ శాఖల చొరవతో తిరుమల తిరుపతి దేవస్థానం గోశాల జిల్లాలోని 165 మంది రైతులకు ఆవులు, కాడెద్దుల జతలను అందించారు. దీని ద్వారా లబ్ధి పొందిన తర్వాత టీటీడీ గోశాల నుంచి 2 హెచ్‌ఎఫ్ జాతి ఆవులను పొంది తానే తిరిగి



తిరుపతయ్యతో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు

వ్యవసాయాన్ని ప్రారంభించాడు. ఆవులు వచ్చిన నెల రోజుల్లోనే 2 కోడే దూడలకు జన్మనివ్వడంతో వారి ఇంట్లో సిరులు కురవడం ప్రారంభమైంది. ఒక ప్రక్క ప్రకృతి వ్యవసాయం కొనసాగిస్తూనే దానికి అనుబంధంగా తన భార్య సహకారంతో ఆవుల ద్వారా వచ్చే పాలను ప్రైవేటుగా విక్రయించడం మొదలు పెట్టారు. 2 ఆవుల నుంచి ప్రతి రోజు 20 లీటర్ల పాలు రావడంతో నెలకు రూ.15వేల ఆదాయాన్ని పొందుతున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.80వేల ఆదాయంతో కుటుంబానికి బాసటగా నిలిచింది. పాల విక్రయంతో వచ్చిన డబ్బులతో తన కుమార్తెకు మంచి విద్యాభ్యాసం అందించారు. వ్యవసాయ కూలీగా ఉన్న తిరుపతయ్యను తిరిగి రైతుగా నిలబెట్టిన టీటీడీ అధికారులకు, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌కు తిరుపతయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థుల ప్రతిభ పట్ల తల్లిదండ్రుల సంతృప్తి..

**ఇటిక్యాల,జనవరి 21 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మొగల్‌రావల్ చెరువు గ్రామంలో గల ప్రభుత్వ, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాలలో చదువుకున్న తర్వాత ఇంటికి వచ్చాక కూడా తల్లిదండ్రులు బాధ్యత తీసుకుని పిల్లల చదువుపై దృష్టి సారించేలా చూసుకోవాలని ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయుడు భీముడు వివరించారు. ప్రతి మూడవ శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయుడు భీముడు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల చదువు సామర్థ్యాలపై, మధ్యాహ్న భోజనం పంపిణీ విద్యార్థుల తరగతుల వారిగా ఇంగ్లీష్, తెలుగు, ఆయా సబ్జెక్టులపై తల్లిదండ్రులకు వివరిస్తూ పాఠశాలలో మేము చెప్పే పాఠ్యాంశాలు కాక సాయంత్రం పూట ఇంటి దగ్గర కూడా మేము ఇచ్చిన హోం వర్క్‌ను పూర్తి చేసేలా తల్లిదండ్రులు చూడాలని విద్యార్థులను పనికి పంపకుండా పాఠశాలకు ప్రతిరోజు పంపాలని గ్రామంలో బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని ఆ విధంగా ప్రతి తల్లిదండ్రులు మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మీరు పాఠశాలకు వచ్చిన నాటి నుండి గ్రామంలో చదువుతున్న ప్రతి విద్యార్థి, విద్యార్థినిలు చదువులో రాణిస్తున్నారని అలాగే మధ్యాహ్న భోజనం నాణ్యవంతంగా ఉంటుందని పాఠశాలలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయించారని పాఠశాలలో ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు, విద్యార్థులను చదువులో రాణిస్తూ విద్యార్థులలో ప్రతిభను తీసుకొస్తున్నారని ఈ సందర్భంగా ఉపాధ్యాయుల విధుల పట్ల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలకు కంపౌండ్ వాల్ నిర్మాణం చేసేలా అందరం కలిసి నడుద్దామని తీర్మానించారు.

## బిజెపి పార్టీ ప్రభుత్వంతోనే తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి

**ఇటిక్యాల,జనవరి 21 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తేనే మరింత అభివృద్ధి జరుగుతుందని అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందని రాష్ట్ర ఎడ్యుకేషనల్ సెల్ కన్వీనర్ బంగి లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల పరిదిలోని వేముల గ్రామంలో బిజెపి మండల అధ్యక్షులు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 32,33 బూత్ అధ్యక్షులను నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎడ్యుకేషన్ సెల్ కన్వీనర్ బంగి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బంగి లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. కాని కెసిఆర్ కుటుంబంలో అందరికి ఉద్యోగాలే ఉన్నాయని విమర్శించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగు భృతి



బూత్ కమిటీల నియామక పత్రాన్ని అందిస్తున్న బిజెపి పార్టీ రాష్ట్ర ఎడ్యుకేషన్ సెల్ కన్వీనర్ బంగి లక్ష్మణ్

లేదని తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ భృతి లేదని దళితులకు 3 ఎకరాల భూపంపిణీ జరగడం లేదని డబుల్ బెడ్‌రూం ఇండ్లు లేవని రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వివరించారు. అంతేకాక ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలను చూశారని అలాగే టిడిపి పార్టీ పాలనను టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని చూస్తున్నారని ఒకసారి బిజెపి ప్రభుత్వానికి కూడా ఒకసారి అవకాశం ఇస్తే ఇంకా మెరుగైన అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మురళీధర్, హరికృష్ణ, శ్రీనివాస్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మాణిక్యరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు శారద, మండల కార్యదర్శి నరేంద్ర, బూత్ అధ్యక్షులు మహేష్, శివరామిరెడ్డి, శేఖర్, నాగేంద్ర, రామాంజనేయులు, పోలింగ్ బూత్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం.. గ్రామాల్లో సీసీ కెమరాలతో డేగ కన్ను..

**జల్లాఘణపురం,జనవరి 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రోడ్డు మీది తాండా గ్రామంలో ఎస్ఐ వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతాల నుండి క్షణాల్లో సైబర్ నేరగాళ్లు డబ్బులు మాయం చేస్తారని అన్నారు. అపరిచత ఫోన్ కాల్ లకు వ్యక్తిగత వివరాలు అందించరాదని అన్నారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ లో మాట్లాడుతూ ఖాతాను ఖాళీ చేయడానికి పలు రకాల అడ్డదారులు చూస్తున్నారన్నారు. సమాచారం నిమిత్తమని బ్యాంకు అధికరారులమని చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తూ నేరాలకు పాల్పడుతున్న మోసగాళ్లు సమాజంలో పెరిగిపోయరన్నారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఏటీఎం పిన్ నెంబర్లు బ్యాంకు అకౌంట్ నెంబర్లు వ్యక్తిగతానికి చెందిన వివరాలు ఏవి తెలుపవద్దని అన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో నేరాలను అదుపు చేయడానికి సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలన్నారుజ సీసీ కెమరా 100మంది పోలీసులతో సమానమని అన్నారు. గ్రామాల్లో సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకుంటే పోలీసులు డేగ కన్నుతో నేరాలను నియంత్రించవచ్చు అని అన్నారు. సీసీ కెమరాల ఏర్పాటు కు స్వచ్ఛందంగా దాతలు ముందుకు రావాలని అన్నారు. గ్రామాల్లోని ప్రజలు పోలీస్ సిబ్బందికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని అన్నారు. సీసీ కెమరాల ఏర్పాటుతో 24గంటల పాటు నేరాలపై పర్యవేక్షణ చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నేరాలపై అవాహన కల్పిస్తున్న ఎస్ఐ

## బాధితురాలికి ఐక్యత ఫౌండేషన్ ఆర్థికసాయం

**వెల్దండ, జనవరి 21 ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని మహాత్మాగాంధీ తాండకు చెందిన రాత్లావత్ చమ్లీకి అనారోగ్యంతో బాధపడుతున్నది. ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేల



ఆర్థిక సహాయాన్ని సమకూర్చగా... శనివారం ఫౌండేషన్ సభ్యులు కొండలుయాదవ్, జగన్, రమేష్‌నాయక్‌లు చమ్లీని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.కార్యక్రమంలో పోతేపల్లి ఎంపీటీసీ చీట్టి కాదూరం, సర్పంచ్ శంకర్‌నాయక్, వార్డు సభ్యులు శ్రీనునాయక్, మణిపాల్ నాయక్, దేశ్యనాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## వృద్ధుడికి ఆర్థిక సహాయం..

**కల్వకుర్తి,జనవరి21 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన చింతకాయల అల్లాజీ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేం దర్ రెడ్డికి ఫౌండేషన్ సభ్యులు సూచించారు. స్పం



దించిన ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అల్లాజీకి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని సమకూర్చగా శనివారం ఫౌండేషన్ సభ్యులు గ్రామస్తులతో కలిసి అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ డైరెక్టర్ మొహమ్మద్ నిజామొద్దిన్, ఆదిరాల యాదయ్య, పోతేపల్లి జంగయ్యగౌడ్, ఆవ తిరుపతి, సత్యం, జహీర్, రామచంద్రయ్య, అంజయ్య, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## మానవత్వం చాటిన డా.మధుబాబు

**అలంపూర్,జనవరి 21 ప్రభాతవార్త :** జోగు లాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజక వర్గం రాజోలి మండల కేంద్రంలోని రైతు వేదికలో కొనసాగుతున్న కంటి వెలుగు క్యాం పు నుంచి తిరిగి బయలుదేరి ప్రాథమిక ఆరో గ్య కేంద్రానికి బైక్‌పై వస్తుండగా మార్గ మధ్యలో గాంధిచౌక్ దాటిన తర్వాత వంతెన మీద స్పృహతప్పి పడిఉన్న వ్యక్తిని చూసి వెంటనే బైక్ ఆపి అతని పల్స్‌రేట్ చెక్‌చేసి, అలాగే బిపి చెక్‌చేసి అతన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

## ఫోటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థికసాయం

**కల్వకుర్తి, జనవరి 21 ప్రభాతవార్త:**కల్వకుర్తి మున్సిపాలిటికి చెందిన ఫోటో వీడియో గ్రాఫర్ అయ్యూబ్ అనారోగ్యంతో బాధపడుతూ గత రెండు రోజుల క్రితం మృతి చెందాడు. మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు వావిళ్ల సంజీవ్‌కుమార్‌యాదవ్ పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రంగినేని



రవికుమార్, వెంకట్, పురుషోత్తం, అనిల్‌గౌడ్, గౌస్, మౌలాలి, వహిద్‌తో పాటు ఫోటో వీడియో గ్రాఫర్స్ ఉన్నారు.

## ఆలయాభివృద్ధికి విరాళం

**వెల్దండ, జనవరి 21 ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని రాఘాయిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన మెండే సంతోష్ రూ.21వేలను దేవాలయ కమిటీ సభ్యులకు



అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శవ్వ రామస్వామి, బాలయ్య, షేక్ చాంద్‌పాష తదితరులు ఉన్నారు.

# జీరోసర్వీసుతోనే ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి

## -టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావారవి

**దేవరకద్ర,జనవరి 21 ప్రభాతవార్త:** గత 3 ఏళ్ళుగా ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న పోరాటాల ఫలితంగా ఈ నెల 27 నుండి ప్రారంభం కానున్న ఉపాధ్యాయ బదిలీల పక్రియను జీరోసర్వీసుతోనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యుటీఎఫ్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావారవి డిమాండ్ చేశారు. దేవరకద్ర మండలం లోని ఆయా గ్రామాలలోని పాఠశాలలను శనివారం చావారవి సందర్శించారు. ఈ సందర్బంగా మార్చి నెలలో జరుగ బోయే ఎమ్మెల్సీ ఎన్నికల సందర్బంగా దేవరకద్ర మండలంలోని ఆయా పాఠశాలలో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పాఠశాలలో చావా రవి ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఏకరువు పెడుతూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యుటీఎఫ్ అధికారిక అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. బదిలీలలో ప్రాధానోపాధ్యా యులకు 5ఏళ్ళ గరిష్ట సర్వీసు కొనసాగించాలన్నారు. అలాగే బదిలీలలో ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. పారదర్శకత పాటించాలన్నారు. పండితులు, పీఈటీ పోస్టుల అప్రెడేషన్ పక్రియను పూర్తిచేసి పదోన్నతులను ఇవ్వాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని ఆయన కోరారు. అలాగే ఉపాధ్యాయులకు ప్రతి నెల 1 తేదిరోజే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాద్యాయులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 3 ధపాల డిఏల ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలన్నారు. మన ఊరు.. మన బడి కార్యక్రమంలో అన్ని పాఠశాలలకు పారిశుధ్య కార్మికులను నియమించాలన్నారు. గత 18 ఏళ్ళుగా భర్తీ చేయకుండా ఆగి ఉన్న ఉపవిద్యాధికారులు, మండల విద్యాధికారుల పోస్టులను వెంటనే ప్రమోషన్లతో భర్తీ చేయాలన్నారు. బదిలీల ప్రక్రియ పూర్తయిన వెంటనే ఉపాధ్యాయ నియామాలకోసం డిఎస్సీ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యుటీఎఫ్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర సీనియర్ నాయకులు క్రిష్ణయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వేణుగోపాల్, దేవరకద్ర, కౌకుంట్ల మండలాల అధ్యక్షులు ఎల్లప్ప, కృష్ణ, రవి, విజయలక్ష్మి, సునిత తదితరులు పాల్గొన్నారు.



కౌకుంట్లలో ఉపాధ్యాయులతో టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావారవి

## సుధాకర్‌రెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

**ధరూర్,జనవరి 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని భీంపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ మేకల సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వారి స్వగృహం చేరుకుని ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు వైస్‌ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, బిఆర్ఎస్‌పార్టీ నాయకులు రమేష్ నాయకుడు, జాకీర్, రాజారెడ్డి, వెంకటేష్ నాయుడు, భగీరథ, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ధర్మపురంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**అమరచింత, జనవరి 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఆత్మకూర్ మార్కెట్ చైర్మెన్ ఎస్.ఎ.రాజు అన్నారు. శనివారం అమరచింత మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయనమాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్దికి ప్రత్యేక నిధులు కేటాయించారని అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న పనులను నాణ్యతగా పనులను చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రమేష్ ముదిరాజ్, నాయకులు మహిపాల్, షాన్‌వాజ్ ఖాన్, వెంకటయ్య, డీసీ పురుషోత్తం, శ్రీనివాసులు, శివ ఉన్నారు.

## కొత్త బస్టాండ్‌లో డబ్బాలను తొలగిస్తాం

**అమరచింత, జనవరి 21 ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చిరు వ్యాపారులు డబ్బాలు వేసుకున్నారని మున్సిపల్ సిబ్బందితో డబ్బాలను తొల గిస్తామని మున్సిపల్ కమీషనర్ మహ్మద్ ఖాజ తెలిపారు. మున్సిపల్ అధికారులు చిరువ్యాపారస్థుల డబ్బాలను తొలగించడం వలనచిరువ్యా పారుస్థులు ఉపాధి కోల్పోతామని చిరువ్యాపారస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌కు కేటాయించిన స్థలంలో అక్రమంగా వెలసిన డబ్బాలను తొలగించడంలో ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఆర్టీసీ సంస్థలపై పెత్తనం చేయడం ఏమిటని చిరువ్యాపారస్తులు అన్నారు.



## సీఎం సహాయనిధి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

**గద్వాల టౌన్,జనవరి 21 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్దకల్ మండల పరిధిలోని చెరగార్లపాడు గ్రామానికి చెందిన లబ్దిదారులు శంకరన్న తండ్రి సంజన్నకు చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ. 42 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు జమ్మన్న, గద్వాల తిమ్మప్ప పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్విజ్ పోటీలు

**మూసాపేట,జనవరి 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుంకినిపూర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల కనుగుణంగా శనివారం బాలసభ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులచే పాటలు పాడించి, నృత్యాలు చేయించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి, నీతి కథలు చెప్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మణ్‌గౌడ్, సహోపాధ్యాయుడు కుర్మయ్య పాల్గొన్నారు.



## పశువుల పునరుత్పత్తిపై క్యాంపు నిర్వహణ

**మూసాపేట,జనవరి 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని జానంపేట గ్రామంలో వెటర్నరీ డా. మధుసూదన్ ఆధ్వర్యంలో పశువుల పునరుత్పత్తిపై క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా వెటర్నరీ డా. మధుసూదన్ మాట్లాడుతూ పాల దిగుబడి ఉన్న పశువులకు ట్రీట్మెంట్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మండల వెటర్నరీ డా. పి. మధుసూదన్, సర్పంచ్ వన్నం శ్రీనివాసులు, ఎంపిటిసి ఆంజనేయులు, నిజాలపూర్ ఎంపిటిసి సిజి గోవర్ధన్, మండల టిఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు ఎండి సత్తార్, ఎడి డా. రషీద్, రైతులు పాల్గొన్నారు.

## ఛలో ఢిల్లీ సెమినర్ విజయవంతానికై పోస్టర్ ఆవిష్కరణ



ఛలో ఢిలీంల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**వనపర్తి టౌన్, జనవరి 21 ప్రభాతవార్త:** తెలంగాణ విభజన చట్టంలోని హామీల సాధన కోసం కృష్ణా జలాల్లో న్యాయమైన మన వాటా కోసం కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరిత రాజకీయలను ఎండకట్టడం కోసం తెలంగాణ ఉద్యమ కాంక్షల సాధనకై ప్రజలను సంఘటితం చేయడం కోసం తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 30, 31 ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టి 30వ తేదీన జంతర్ మంతర్ వద్ద కృష్ణాజలాలల్లో మన వాటా విభజన హామీ సాధనకై దీక్ష 31వ తేదీన కానిస్టేబుల్ క్లబ్ లో కేసీఆర్ 9ఏళ్ల పాలన అభివృద్ధి వాస్తవాలపై సెమినార్ నిర్వహిస్తున్నందున విజయవంతం చేయాలని దానికి ప్రజలందరు సహకరించాలని శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది, ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్య ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఖర్చు చేయవలసిన లక్షల కోట్ల రూపాయలు కాళేశ్వరం లాంటి పనికి రాని ప్రాజెక్టులకు ఖర్చు చేసి కాంట్రాక్టర్ల లాభాల కోసం కమీషన్ల కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగాం చేశారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష తెలంగాణ కొరకు ఉద్యమాలు చేస్తూ రాష్ట్రం కొరకు 1200 మంది అమరవీరుల త్యాగాలతో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల గొంతు నొక్కి నిరంకుశ పరిపాలన చేస్తూ ప్రజాస్వామ్యాన్ని నవ్వులపాలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థిని దివాలా తీయించి మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేసి కూడా నేడు ఉద్యోగస్తులకు జీతాలుఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదని అన్నారు. రాష్ట్ర సమస్యలు ఎక్కడెక్కడ ఉండగా ప్రజల దృష్టిని మళ్లించడం కోసం దేశ వ్యాప్తంగా అధికోసం కక్కుర్తి పడుతున్నారని ఎద్దేవ చేశారు. టీఆర్ఎస్ దుర్మార్యాలను దేశ వ్యాప్తంగా తెలియజేయడం కోసం ఢిల్లోలో కార్యక్రమాలు చేపట్టిందని అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి అధ్యక్షులు ఎంఎ ఖాదర్, జిల్లా ఉపాధ్యక్షులు కె.బాలకృష్ణ, టౌన్ అధ్యక్షులు రఘు నాయుడు, మండల అధ్యక్షులు పిక్కిలి బాలయ్య, టౌన్ ప్రధాన కార్యదర్శి శాంతారామ్ నాయక్, జన సమితి సీనియర్ నాయకులు పి.మన్యం, తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రక ప్రదేశాలను సుందరంగా తీర్చిదిద్దుతాం!

- మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్
- కొత్త హంగులతో ముస్తాబు కానున్న పురాతన లింగంబావి

**గద్వాల టౌన్,జనవరి 21 ప్రభాతవార్త :** గద్వాల పట్టణం మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డులోని అలనాటి రాజుల కాలం నాటి పురాతన లింగంబావిని శనివారం మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్ పరిశీలించారు. త్వరలో జరగబోయే గద్వాల పెద్ద జాతర సందర్భంగా లింగంబావి చుట్టు పక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి వివిధ రకాల పూల మొక్కలను రంగు రంగులతో నూతనంగా ముస్తాబు చేయాలని మున్సిపల్ అధికారులకు ఛైర్మన్ కేశవ్ ఆదేశించారు. ఈసందర్భంగా ఛైర్మన్ కేశవ్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే గద్వాల పెద్ద జాతర శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలను గత ఏడాది కంటే ఈ ఏడాది కూడా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ఇక్కడికి ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. లింగంబావి చుట్టు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి వివిధ రకాల పూల మొక్కలను నాటి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పే విధంగా పచ్చని చెట్లతో అన్ని కొత్త హంగులతో రంగు రంగులతో లింగం బావిని విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులకు ఛైర్మన్ కేశవ్ ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, టి. శ్రీనునరహరిగౌడ్, నాగరాజు, కృష్ణ, మహేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కోటేష్, నాగులు యాదవ్, బొట్టు సుధాకర్, రిజ్వాన్, మున్సిపల్ అధికారులు డిఇ, ఏఈ, జవాన్లు పాండు, పరమేష్ పాల్గొన్నారు.



పురాతన లింగంబావిని పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్

## ఘనంగా శ్రీపురందరదాసుల ఆరాధన ఉత్సవాలు

**మల్దకల్,జనవరి 21ప్రభాతవార్త:** ప్రముఖకర్ణాటక వాగ్గేయకారుడు, నారందాసులైన శ్రీ పురందరదాసుల ఆరాధన ఉత్సవాలు ఆదిశిలా క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో వేద పాఠశాలలో శ్రీ పురందర దాసుల విగ్రహానికి పంచామృత అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం దాసుల వారి చిత్రపటంతో దేవాలయంలో రథోత్సవం, పల్లకిసేవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి దేవాలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, శేషదాశ వంశస్తులు, దీరేంరదదాస్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు హరినామ సంకీర్తనం చేస్తూ భజనలు నిర్వహించారు. బాబురావు, చంద్రశేఖరరావు, అరవింద్‌రావు, నాగరాజు, శర్మ, పద్మనాభయ్య, భక్తులు పాల్గొన్నారు.



పురందరదాసుల ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

## జిల్లా అదనపు కలెక్టర్‌కు ఘన సన్మానం

**వనపర్తి టౌన్,జనవరి 21 ప్రభాతవార్త:** తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం వారు వపపర్తి జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌ను సన్మానించారు. అలాగే దివ్యాంగుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం వారు మాట్లాడుతూ దివ్యాంగుల ఉద్యోగుల సంక్షేమానికి కృసి చేయాలని దివ్యాంగ ఉద్యోగులకు రావాలసిన కన్వీనర్స్, అలవెన్స్ ట్రాన్స్ఫర్ లో 40%ను పరిగణంలోకి తీసుకోవాలని విన్నవించడం జరిగింది. ఈ విషయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డి.నరేందర్, కోశాధికారి ఎన్.రామకృష్ణ, రాష్ట్ర బాధ్యులు సుబ్బారెడ్డి, కె.నిరంజన్, జిల్లా బాధ్యులు కె.వెంకటయ్య, మల్లయ్య, ఎండి గౌస్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ను సన్మానిస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

## కల్వర్టుకు మరమ్మత్తులు..

**ఖిల్లాఘణపురం,జనవరి 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామం నుండి కమలుద్దీన్‌పూర్ వెళ్లే రహదారిలో ధ్వంసమైన కల్వర్టును మాజీ వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ లక్ష్మారెడ్డి సొంత ఖర్చులతో మరమ్మత్తులు చేశారు. గత కొన్ని నెలల నుండి వరద నీరు కల్వర్టు మీద నుండి ప్రవహించడంతో కల్వర్టు పూర్తిగా ధ్వంసమై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. పలుమార్లు ఆ ప్రాంతంలో ప్రమాదాలు కూడా జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తులిపారు. కల్వర్టు బాగా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ నరకయాతన అనుభవించారు. అధికారులు వాహనదారుల ఇబ్బందులను చూసి అలసత్వం ప్రదర్శించారని గ్రామస్తులు తెలిపారు. రహదారిపై భారీ వాహనాలు వెళ్లడంతో గుంతల మయంగా మారిందని వాహనదారులు వాపోయారు. ప్రయాణికుల అవస్థలను దృష్టిలో ఉంచుకొని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ లక్ష్మారెడ్డి మరమ్మత్తులు చేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



వాహదారులకు ఇబ్బందిగా మారిన కల్వర్టు రహదారి (ఫైల్‌ఫోటో), కల్వర్టు తాత్కాలిక మరమ్మత్తులు చేపడుతున్న దృశ్యం

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీ పెంపు

**గద్వాల టౌన్,జనవరి 21 ప్రభాతవార్త :** గద్వాల అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం పరిధిలో మొదటి, తృతీయ, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లింపులకు జనవరి 25వ తేదీ వరకు పొడిగించడం, గద్వాలలోని ఎంఏఎల్‌డి అంబేద్కర్ కళాశాల శాఖ సలహా కేంద్రం సమన్వయకర్త ప్రిన్సిపల్ శాఖ సలహా కేంద్రం సమన్వయకర్త ప్రిన్సిపల్ శ్రీపతినాయుడు శనివార ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత విద్యార్థుల పరీక్షలకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు.

## సిసి రోడ్డుకు శంకుస్థాపన



సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**జడ్చర్ల,జనవరి 21 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం ముందు ఉన్న సిసి రోడ్డుకు, పరిసర ప్రాంతాల్లో దెబ్బతిన్న సిసి రోడ్లకు రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించబోయే నిర్మాణ పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా కాలనీలోని వ్యాపారులు ఉన్న రోడ్డుపైనే కొత్త సిసి రోడ్డు వేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మి రవిందర్, జడ్పీ వైస్ ఛైర్మన్ కోడ్గల్ యాదయ్య, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ పాలాది సారిక, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ



నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**జడ్చర్ల,జనవరి 21 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం జిఒ నంబర్ 58 ప్రకారం నిరుపేద కుటుంబాలకు శనివారం స్థానిక ఎమ్మెల్యే డా.సి. లక్ష్మారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అర్హులైన 105 మంది లబ్దిదారులకు ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదల కోసమే ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. పేదరికంలేని రాష్ట్రంగా తెలంగాణ ఉండాలని అందు కోసం మనమందరం తోడ్పాటు నందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెరాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ప్రమోషన్‌లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లు పాటించాలి

**వనపర్తి టౌన్,జనవరి 21 ప్రభాతవార్త:** ఉపాధ్యాయుల ప్రమోషన్ లలో ఎస్సీ,ఎస్టీల ప్రమోషన్ లలో అడక్వెసితో సంబందం లేకుండా రూల్ ఆఫ్ రిజర్వేషన్ల అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ వనపర్తి జిల్లా శాఖ అధ్యక్షులు కె.నిరంజన్ మౌర్య, ప్రధాన కార్యదర్శి వడ్డెమాన్ రాముడు, గౌరవ సీనియర్ నాయకులు డి,బాలస్వామి, చెన్నకేశవులు, ఎస్.వెంకటస్వామి, విజయ్ కుమార్, అరుణ్ కుమార్, వెంకటకృష్ణ లను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా ఓపెన్ సీనియారిటీకి అర్హత కలిగి ఉన్నఎస్సీ, ఎస్టీఉపాధ్యాయులకు సంబందించిన జాబితాను ముందుగానే ప్రకటించాలని కోరారు. కొత్తగా ఏర్పాటు చేసుకున్న 33 జిల్లాఒ రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ ను మొదటి నుండి లెక్కించాలని, ప్రమోషన్ల ప్రక్రియ ప్రత్యేక పద్దతిలో చేపట్టాలని అదే విధంగా లాంగ్వేజ్ పండిట్ పోస్టలను అప్‌గ్రేడ్ చేస్తూ వారికి ప్రమోషన్ ఇస్తూ అందులో సీనియార్టి ప్రకారం ఎలిజిబుల్ అయిన ఎస్‌జీటీ లకు అవకాశం కల్పించాలని కోరుతూ ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అన్నారు.

## అనాథల హక్కుల కోసం మంత్రికి వినతి



మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**వనపర్తి టౌన్,జనవరి 21 ప్రభాతవార్త:** అనాథ పిల్లల సంక్షేమం, సంరక్షణ కోసం సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ అనాథలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వారి విద్యా, వైద్యం, ఉపాధి, సంక్షేమం, సంరక్షణతో పాటు అనాథ పిల్లల గుర్తింపుకు స్మార్ట్ కార్డులు, కేజీ టు పీజీ వరకు రెసిడెన్షియల్ గురుకులం, ప్రతి జిల్లాలో అనాథ గురుకులాలు, రిజర్వేషన్ లతో పాటుగా వారికి 23 జూన్ 2015 నాడు అనాథలకు అమ్మనాన్న ప్రభుత్వమేనని వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఇచ్చి మరచిన హామీలన్నింటినీ తక్షణమే నెరవేర్చాలని నాడు మంత్రి ఉప సంఘంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలని వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికితీసుకెళ్లి పరిష్కరమయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. అనాథల కోసం మహాజననేత మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరగబోయే భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ పరిష్కారం చేయకపోతే చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరిస్తూ అనాథల హక్కులు, సంక్షేమం, రక్షణ విషయంలో తమరి బాద్యతను నిర్వర్తించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాజనగరం రాజేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోర్డినేటర్ గంధం లక్ష్మయ్య, మాదిగ సూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివ మాదిగ, బేడబుడగ జంగం రాష్ట్రఅధ్యక్షుడు సిరివాటి శ్రీనివాస్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకులు గంధం గట్టయ్య తదితరులు ఉన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత

**పెబ్బేరు, జనవరి21 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలో శ్రీచౌడేశ్వరి జాతర సందర్భంగా నిర్వహించిన పీపీఎల్ -13 ఎడిషన్ విజేతగా మన్యం రైడర్ నిలిచింది. శుక్రవారం ఫైనల్ మ్యాచ్ లో రాఘవేంద్ర వారియర్స్ వర్సెస్ మన్యం రైడర్స్ పోటీ పడగా మొదట టాస్ గెలిచి రాఘవేంద్ర వారియర్స్ ఫీల్డింగ్ ఎంచుకున్నారు. మొదట బ్యాటింగ్ చేసిన మన్యం రైడర్స్ 3వికెట్లు కోల్పోయి 117 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన రాఘవేంద్ర వారియర్స్ మూడు వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసి లక్ష్యాన్ని చేరుకోలేక పోయింది. దీంతో పీపీఎల్-13 ఫైనల్ విజేతగా మన్యం రైడర్స్ నిలిచింది. ఈ కార్యక్రమానికి స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీసాయినాథ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఆటలో గెలుపోటములు సహజమని గెలిచనవారు కప్పు గెలుస్తారు, ఓడినవారు అభిమానుల మనసులు గెలుస్తారని అన్నారు. పెబ్బేరు పట్టణంలో మంత్రి నిరంజన్ రెడ్డి సహకారంతో 9ఎకరాల ఆట స్థలాన్ని అతి త్వరలో మీ ముందుకు తీయబోతున్నామని అన్నారు. కార్యక్రమానికి మొదటి బహుమతి రూ.35వేలు ఎద్దుల కరుణశ్రీసాయినాథ్ అందించారు. షీల్డ్ దాత డాక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి సరోజిని హాస్పిటల్, రెండవ బహుమతి రూ.25 వేలు దాతకట్ట శ్రీనివాస్‌రెడ్డి మాజీ ఎంపీటీసీ, షీల్డ్‌దాతరవీందర్ నాయుడు, నాగరాజు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ కర్రెస్వామి, మంగరాయి శ్యామల మన్యం, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్‌పర్సన్, పీపీఎల్ వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సహదేవుడు, అజాద్ అధ్యక్షులు క్రాంతి కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# అభాగ్యులకు సీఎంఆర్‌ఎఫ్ అండ

## - గతంలో ఎవరూ పట్టించుకోలే: ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జనవరి21,ప్రభాతవార్త:** అభాగ్యులకు, పేదలకు తెలంగాణ సర్కార్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దేవరకద్ర నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 102 మంది బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. రూ.41లక్షల 92 వేల 500 విలువ చేసే చెక్కులను బాధితులకు అందజేసి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలోని సర్కార్ దవాఖానలకు సీఎం కేసీఆర్ అభివృద్ధి చేసి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణకు మొదటటి ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. గతంలో సీఎం ఆర్‌ఎఫ్ అంటే ఏదో పరిచయం ఉన్న, పైరవీలు చేసే నాయకులకు మాత్రమే అది మండలంలో ఒకరిద్దరికి వస్తే మహాగొప్ప అన్నారు. స్వరాష్ట్రంలో ప్రతి పేద వాడికి సర్కార్ ఫలాలు అందేలా సీఎం కేసీఆర్ చర్యలు తీసుకున్నారన్నారు. మధ్య దళారుల ప్రమేయం లేకుండా పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆరవ వార్డులో సిసి రోడ్డు,డ్రైనేజీ నిర్మాణాలకు మంత్రి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన



**వనపర్తి టౌన్, జనవరి 21 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణంలోని 6వ వార్డు మెట్టుపల్లిలో ఎస్‌డిఎఫ్ నిధుల ద్వారా సిసి డ్రైనేజీ నిర్మాణాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి కౌన్సిలర్ కంచరవి, జిల్లా అధ్యక్షుడు, మునిసపల్ ఛైర్మన్ గట్టు యాదవ్, మార్కెట్ ఛైర్మన్ పలుస రమేష్ గౌడ్, వైస్ ఛైర్మన్ వాకిటిశ్రీధర్, కౌన్సిలర్లు కాగితాల లక్ష్మీనారాయణ, బండారు కృష్ణ, పుట్టల పాకుల మహేష్,విభూది నారాయణ, నందిమల్ల శ్యామ్, ఉంగ్లం తిరుమల్, రహీం, ఆవుల రమేష్, పరంజ్యోతి, తోటశ్రీను,వార్డు నాయకులు 6వ వార్డు అధ్యక్షుడు రంగం ఆంజనేయులు, రంగం నరసింహ్మా, మాజీ కౌన్సిలర్లు రెడ్యానాయక్, రమేష్ నాయక్, సుగురు వెంకటస్వామి, రంగం రాములు,రంగం కిష్టన్న, గట్టన్న,కొండన్న, గోకం మన్యం, రంగం మణ్యం, సుగురు రామస్వామి, రంగం పక్కిరన్న,బలరాం, రంగం నాగన్న, బి.సచ్చిన్, సుగుర్ రమేష్, రంగం రావి, స్వామి సుగుర్‌రాజు, దూల రాముడు,టౌన్ ఎస్టీ సెల్‌ఉపాధ్యక్షుడు జనార్ధన్ నాయక్, వార్డు ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, దుద్యానాయక్, రాములునాయక్,పెంటయ్య, కురుమనాయక్, రవినాయక్, రాజునాయక్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బ్లాసమ్స్ ప్లే వే పాఠశాలలో విజ్ఞానశాస్త్ర ప్రదర్శన



**వనపర్తి టౌన్, జనవరి 21 ప్రభాతవార్త:** బ్లాసమ్స్ స్లే వే పాఠశాలలో శనివారం విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ ఛైర్మెన్ వాకిటి శ్రీధర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను తిలకించడం జరిగింది, ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మెన్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోని సమాజంలో ఉన్నతం స్థాయిలో ఎదగాలని కొత్తక్తొ ఆవిష్కరణలతో సమాజాన్ని విజ్ఞానం వైపు నైపుణ్యానాల వైపు నడవాలని వారు విద్యార్థులకు సూచించారు. శాస్త్ర ప్రదర్శన ప్రదర్శించినందుకు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తిరుమల్, జంగిడిపురం కాలనీ అధ్యక్షులు కురుమయ్య, కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధితో పేదల ఆరోగ్యానికి భరోసా



**వనపర్తి టౌన్, జనవరి 21 ప్రభాతవార్త :** సీఎం సహాయ నిధి పథకంతో పేదల ఆరోగ్యానికి ఎంతో భరోసా లభిస్తుందని బలహీన వర్గాల ప్రజలు కార్పోరేట్ వైద్యంతో మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారని వనపర్తి జిల్లా బీఆర్ఎస్ మీడియా సెల్ కన్వీనర్ దాడియోగానందరెడ్డి అన్నారు. శనివారం శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామానికి చెందిన బోయ మినెగ శేషయ్యకు మంజూరైన రూ.60వేల సీఎం సహాయ నిధి, వడ్డె బొజ్జవెంకన్న మనువడు బిట్టుకు మంజూరైన రూ.60వేల సీఎం సహాయ నిధి చెక్కులను మంత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు అందజేసినట్లు యోగానందరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆపదలో ఆదుకున్న మంత్రి నిరంజన్ రెడ్డికి యోగానందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఈటెల రాజేందర్‌కు బిజెపి నాయకుల సన్మానం



**ఇటిక్యాల,జనవరి 21 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో హుజూర్‌నగర్ బిజెపి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఈటెల రాజేందర్‌కు స్థానిక మండల నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శాలువా, పూలమాలతో సత్కరించారు. మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ఆంధ్రప్రదేశ్ పర్యటనలో పాల్గొని తిరుగు పయనంలో హైదరాబాద్‌కు జాతీయ రహదారిపై వెళ్తుండగా మార్గ మధ్యలోని మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఎమ్మెల్యే రాజేందర్‌కు స్థానిక బిజెపి నాయకులు ముదిరాజ్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ హైదరాబాద్‌కు పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో అశోక్, దశరథం, సాగర్, నాగరాజుయాదవ్, సంపత్, రాజేష్, అశోక్, యాదగిరి, వెంకటేష్, దేవెగౌడ, నవీన్‌కుమార్, ముదిరాజ్ నాయకులు వెంకటన్న, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం

**గండీడ్,జనవరి 21 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రెండో విడత కంటి వెలుగు శిబిరానికి వైద్యులు ఉదయం 9 గం.లనుండి సాయంత్రం 4 గం.ల వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు కంటి అద్దాలు అందజేస్తారని గ్రామంలోని పేద ప్రజలు డబ్బు ఖర్చు పెట్టుకుని చేయించుకోలేక కంటిచూపు మందగిస్తున్న నిర్లక్ష్యం చేస్తున్నారని అటువంటి వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అందజేస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలందరు సద్వినియోం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపాల్, వైస్ ఎంపిపి ఈశ్వరయ్యగౌడ్, తహసిల్దార్ జ్యోతి, ఎంపిడిఓ రూపేందర్‌రెడ్డి, స్పెషలాఫీసర్ డా. జరీనాబేగం, క్యాంపు స్పెషల్ ఆఫీసర్ డా. చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ అప్సర్, స్పెషల్ ఆఫీసర్ బాబురావు, ఆర్ఐ రఘు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల విద్యార్థుల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలి
- సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 204 మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


మైనార్టీ గురుకులాల ప్రవేశాల పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 21 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేందుకు గురుకుల పాఠశాలలు, కళాశాలల సిబ్బంది కృషి చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన మైనర్టీ గురుకులాల ప్రవేశాల బ్రోచర్ ను మంత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశంచి మంత్రి మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి భవిష్యత్తుల్లో వారిని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1029 గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేయగా అందులో 204 మైనార్టీ గురుకుల, కళాశాలలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. మెరుగైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పాఠశాలలు, కళాశాలల్లో పారదర్శకంగా విద్యార్థులను ఎంపిక చేయాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ విద్యాసంస్థల ఆర్ఎల్‌సీ అవిలారాణి,ప్రిన్సిపల్ జనార్దన్‌గౌడ్,సిబ్బంది సౌమ్య ఉన్నారు.

# కొమ్ముల గట్టు వెంకటేశ్వరస్వామి సన్నిధిలో మంత్రి నిరంజన్‌రెడ్డి

- అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు..
- భక్తులతో కలిసి సహపంక్తి భోజనాలు..
- దేవాలయం వరకు 2 కిమీ బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి హామీ




శ్రీశ్రీశ్రీ కొమ్ముల గట్టు లక్ష్మీవెంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని జంగమాయిపల్లి గ్రామ శివారులోని గుట్టల్లో వెలసిన శ్రీశ్రీశ్రీ కొమ్ముల గట్టు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ని శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దర్శించుకున్నారు. శనివారం నుండి ప్రారంభం అయ్యే స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని అమావాస్య పూజలు చేశారు. ఈ సంద ర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభ:తో మంత్రి కి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భక్తులతో పాటు సహపంక్తి భోజనాలు చేశారు. గ్రామం నుండి దేవాలయానికి వచ్చే 2కిమీ మేర బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సతీష్, వనపర్తి మున్సిపల్ ఛైర్మెన్ గట్టు యాదవ్, వైస్ ఛైర్మెన్ వాకిటి శ్రీధర్, మార్కెటనఛైర్మెన్ రమేష్ గౌడ్,ఉపసర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ గిరమ్మ, ఆలయ ఛైర్మెన్ కొండల్‌రావు, పెద్దమందడి మాజీ జడ్పీటీసీ వెంకటస్వామి, వనపర్తి కౌన్సిలర్లు బండారు కృష్ణ, డీలర్ సత్యం, తదితరులు ఉన్నారు.

# తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలి


ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**రాజాపూర్,జనవరి 21 ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంతో పాటు వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ప్రభుత్వం త్వరగా పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అదేవిధంగా అనాథ పిల్లల పూర్తి బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని ముఖ్యమంత్రి కెసిఆర్ 23 జూన్ 2015 అనాథ పిల్లలకు ప్రభుత్వమే తల్లిదండ్రి అవుతారని అనాథ పిల్లలకు అన్ని జిల్లాల్లో కో గురుకులాలను ప్రారంభిస్తామని, హామీ ఇవ్వడం జరిగింది. అనాథలైన పిల్లలకు రిజర్వేషన్లు కల్పిస్తుందని యాదగిరిగుట్ట వద్ద రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించి ప్రణబ్ ముఖర్జీ భరోసా ఇచ్చారు. అదేవిధంగా అనాథ పిల్లలకు తద్వారా కుల, ఆదాయ, ఎలాంటి ధృవీకరణ పత్రం అవసరం లేకుండా కెజి టు పిజి వరకు ఉచిత విద్య అందిస్తామని గురుకులాల్లో ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తామని మంత్రివర్గ ఉపసంఘ సిఫార్సును కెటిఆర్ ప్రకటించారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం పక్కనపెట్టి అనాథలైన పిల్లలకు ద్రోహం చేస్తుందని గుర్తు చేస్తూ అదేవిధంగా ముఖ్యమంత్రి సీఎం కెసిఆర్ దృష్టికి తీసుకువెళ్లి అనాథ పిల్లలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి ఉమ్మడి జిల్లా ఇంఛార్జి టైగర్ జంగయ్య మాదిగ, ఎంఎస్‌పి జిల్లా ఇంఛార్జి కావలి కృష్ణయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ వినోదమాదిగ, ఎమ్మార్పీఎస్ మిడ్జిల్ మండల అధ్యక్షులు పడిగళ్ల సురేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాజాపూర్ అధ్యక్షులు నరిగె యాదయ్య మాదిగ, లక్ష్మీ మాదిగ, యాదయ్య మాదిగ, నాగరాజు మాదిగ, భీంరాజ్ మాదిగ, జంగయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# కంటి వెలుగు పేదింటి వెలుగు


వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, జిల్లా అధికార యంత్రాంగం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 21 ప్రభాతవార్త:** కంటి వెలుగు కార్యక్రమంలో నాణ్యత ప్రమాణాలు ఏ మాత్రం తగ్గకుండా ప్రతి రోజు నిర్ధేశించిన లక్ష్యం మేరకు కంటి పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రంలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు, వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కంటి పరీక్షల వైద్య శిబిరాలు సజావుగా నడిచే విధంగా చూసుకోవాలని, ఏమైనా సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. వైద్య శిబిరాల నిర్వహణపై జిల్లా స్థాయి క్వాలిటీ కంట్రోల్ బోర్డులు ఎప్పటికప్పుడు లోపాలను ఎత్తి చూపి సరిదిద్దుకునే విధంగా చూడాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో శుక్రవారం వరకు 50 బృందాలు 6482 మందికి కంటి పరీక్షలు నిర్వహించారని, ఇందులో 1930 మందికి దగ్గరి చూపు కంటి అద్దాలు అవసరమని గుర్తించి వెంటనే అందించామన్నారు. 1380 మందికి దగ్గరి, దూరపు చూపు అద్దాలు అవసరం కాగా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి డేటా పంపించామన్నారు. కంటి పరీక్షల శిబిరాలకు మరింత మంది వచ్చే విధంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రిన్సిపల్ సెక్రటరి రిజ్వి, హెల్త్ కమీషనర్ శ్వేతా మహంతి, అదనపు కలెక్టర్ మనుచౌదరి, జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్ తదితరులు ఉన్నారు.

# గార్లపాడును మండలంగా ప్రకటించే వరకు పోరాటం

- ప్రజాభిప్రాయ సేకరణలో మండల సాధన సమితి నేతలు

**కోయిల్‌కొండ,జనవరి 21 ప్రభాతవార్త:** మండలంలోని గార్లపాడు గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించే వరకు ఉద్యమాలు చేపడతామని మండల సాధన సమితి నేతలు కేశవాపూర్ ఎం. రాము నాయక్, వెంకట్‌రామ్‌రెడ్డి, వెంకటేష్,ఆంజనేయులు తెలిపారు. శనివారం వారు మండలంలోని కేశవాపూర్ గ్రామ పంచాయతీలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణకు ఆయా గ్రామాల నుండి స్పందన వస్తుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గార్లపాడును నూతన మండలంగా ప్రకటించాలని మద్దతు పలుకుతున్నారని తెలిపారు. కేశవాపూర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో మంచి స్పందన లభించిందన్నారు. కేశవాపూర్ సర్పంచ్ బత్తుల మొగులయ్య మాట్లాడుతూ గార్లపాడు మండలంగా కావాలని తీర్మాణం చేశారు. పెర్కివీడ్ గ్రామ సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి సైతం గార్లపాడు మండలంగా కావాలంటూ పంచాయతీ తీర్మాణం చేశారు.

ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ గార్లపాడు నూతన మండలం కావడా నికి అన్ని అర్హతలు కలిగి ఉందన్నారు. మండల సాధన కోసం సోమవారం నుండి గార్లపాడు గ్రామస్టేజీ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జెఎసి నేతలు నవీన్, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి గంట కవిత




**అయిజ,జనవరి 21 ప్రభాతవార్త:** పేద, ధనిక అని తేడా లేకుండా ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గంట కవిత పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో జిల్లాన్యాయ అధికార సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రజలందరికి చట్టాలపై అవగాహన పెంపొందించాలని న్యాయవాదుల సూచించారు. అలాగే ప్రతి ఒక్కరు చట్టాలను గుర్తుంచుకుని మసలుకోవాలని పేదవారికి ఫీజు లేకుండా వాదించడానికి న్యాయమైన సలహాలు ఇవ్వడానికి జిల్లా న్యాయసేవా అధికార సంస్థ పని చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అలాగే సమావేశంలో పలు చట్టాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్ లక్ష్మి, న్యాయవాదులు మధుకుమార్, జనార్ధన్‌రెడ్డి,మధుసూదన్‌బాబు,రవిశంకర్,సురేష్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

# పది విద్యార్థులను చదివించి మంచి ఫలితాలు తేవాలి



**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 21 ప్రభాతవార్త:** ప్రణాళికా బద్ధంగా పదవ తరగతి విద్యార్థులను చదివించి పదిలో మంచి ఫలితాలు తేవాలని సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటి ఛైర్మన్, బాలానగర్ జడ్పీటిసి కళ్యాణి అన్నారు. శనివారం జడ్పీ సీఈఓ చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఆరవ స్థాయి సంఘం సమావేశానికి అధ్యక్షత వహిస్తూ మిడ్జిల్ జడ్పీటిసి శశిరేఖతో కలిసి పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లు జాప్యం లేకుండా చూడాలన్నారు. హాస్టల్లో ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిం చిందన్నారు. బాలానగర్ హాస్టల్లో దోమలు విపరీతంగా ఉన్నాయి, దోమల జాలి ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. విద్యా ర్థులకు నాణ్యమైన భోజనంతో పాటు శుభ్రత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు హాస్టల్లో ఉండి చదివే విద్యార్థుల్లో పదవ తరగ తిలో మంచి మార్కులు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిపై రిజల్ట్ పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రస్తు తం చలి తీవ్రంగా ఉందని దుప్పట్లు లేని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జ్యోతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అన్నాసాగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌ను సస్పెండ్ చేసిన కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 21 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడినందుకు గాను భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాక అన్నాసాగర్ పూర్వపు గ్రామ పంచాయతీ కార్యదర్శి, ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని కూడా సస్పెండ్ చేసేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేసినట్లు ఆయన వెల్లడించారు. అన్నాసాగర్ గ్రామ సర్పంచ్ కె. నీలిమ గ్రామ పంచాయతీకి సంబంధించి వివిధ పద్దుల కింద సుమారు 14 లక్షల 66 వేల రూపాయలను దుర్వినియోగం చేశారని అందువల్ల ఆమెను సస్పండ్ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. నిధుల దుర్వినియోగంలో అప్పుడు పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి ప్రమేయం కూడా ఉన్న దృష్ట్యా శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# మిషన్ భగీరథ నీళ్లు అంతరాయం లేకుండా సప్లై చేయండి: జడ్పీ ఛైర్‌పర్సన్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 21 ప్రభాతవార్త:** మిషన్ భగీరథ నీళ్లు అంతరాయం లేకుండా సప్లై చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఒకటవ స్థాయి సంఘం సమావేశంలో పాల్గొని మూసపేట జడ్పీటిసి ఇంద్రయ్యసాగర్, దేవరకద్ర జడ్పీటిసిఅన్నపూర్ణతో కలిసిసమీ క్షించారు. ఈసందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ మిషన్ భగీ రథ నీళ్లు అంతరాయం లేకుండా సప్లై చేయాలని పైప్‌లైన్ కోసం రోడ్లు తవ్వి వదిలేయడం వల్ల రోడ్లు గుంతలు ఏర్పడుతున్నాయని వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. పైప్‌లైన్ తరచూ లీకేజీ అవుతున్నాయని లీకేజీ కాకుండా చూడాలని నల్లాలు బిగించాలని వాటర్ వేస్ట్‌గా పోకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

